క్లుప్తంగా

దేవీ భాగవత కథా శ్రవణం ముక్తి దాయకం



విజయవాడ కల్చరల్: దేవీ భాగవత కథా శ్రవణం భక్తి ముక్తి దాయకమని ఆధ్యాత్మిక వేత్త మల్లాది రామనాథ శర్మ అన్నారు. శృంగేరీ పీఠాధిపతులు భారతీ తీర్థ మహాస్వామి 70వ జన్మదిన వేడుకలు, దసరా మహోత్సవాల సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో బుధవారం దేవీ భాగవతం అంశంగా ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. రామనాథ శర్మ మాట్లాడుతూ సర్వశక్తి స్వరూపిణిని మహాశక్తిగా భావించవచ్చన్నారు. దేవీ నవరాత్రులలో కథా శ్రవణం చేయడం వల్ల సర్వపాపాలు హరిస్తాయని తెలిపారు. కార్యక్రమాన్ని శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్ట్వాల హనుమత్ ప్రసాద్ ప్రారంభించారు.

కొనసాగుతున్న పుణ్యతిథి మహోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు షిర్డీ సాయి బాబా మందిరంలో షిర్డీ సాయినాధుని 105వ పుణ్యతిథి మహోత్సవాలు బుధవారం నాలుగోరోజుకు చేరుకున్నాయి. బాబావారికి విశేషంగా లఘున్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, పంచసూక్త పఠనం చేశారు. క్షీరం, తేనెతో బాబాకు అభిషేకం చేసి గరికతో లక్షనామార్చన నిర్వహించారు. లోక కల్యాణార్థం మందిర కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు సాయినాథ, గణపతి హోమం వేదపండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

అన్నప్రసాద వితరణ..

మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో బుధవారం షిర్డీ సాయినాధుని పుణ్యతిథి మహోత్సవాలలో భాగంగా అన్నప్రసాద వితరణ జరిగింది. తొలుత బాబాకు విశేషంగా అభిషేకాలు, పూజలు జరిగాయి. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకులు తంగెళ్లమూడి వీర మోహన రావు పర్యవేక్షించారు.

భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రులకు రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేస్తున్న భక్తులకు తమవంతు సహాయం చేసేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. దుర్గగుడి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఘాట్ల వద్ద, ప్రసాదాల కౌంటర్ల వద్ద రాకపోకలు సాగిస్తున్న అమ్మవారి భక్తులకు మజ్జిగ, కూలింగ్ వాటర్ పంపిణీ చేయడం, ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటుచేసి మందులు పంపిణీ చేస్తూ భక్తులకు సేవ చేస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలను భక్తులంతా మెచ్చుకుంటున్నారు.

శ్రీలక్ష్మీ.. శిరసానమామీ

జగన్మాతా..కరుణించమ్మా.. అంటూ భక్తులు మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మను బుధవారం వేడుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివస్తున్న భక్తులు ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకొని ఆనందంతో తన్మయత్వం చెందుతున్నారు. పండగ సందడితో కోలాహలంగా మారిన కొండంతా భక్తజన సంద్రంతో నిండిపోయింది. మహిళలు ఆర్జిత సేవల్లో భాగంగా ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ













కరుణించు కనకవర్షిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాలుగోరోజు బుధవారం అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా భక్తుల పూజలు అందుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు దేవాలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

- అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాలలో బుధవారం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకారం చేసి పూజలు చేశారు.
- ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో బుధవారం అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు.
- రామకృష్ణాపురం దుర్గాదేవి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేశారు.
- రామలింగేశ్వరపేట ప్రసన్నాంజనేయ స్వామివారి దేవాలయం వద్ద ఆలయకమిటీ ఆధ్వర్యాన శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు తాన్న పూర్ణచంద్రరావు పర్యవేక్షించారు.



దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో గాయత్రీదేవిగా అమ్మవారు



రామకృష్ణాపురంలో మహాలక్ష్మీ దేవిగా అమ్మవారు



న్యూఆర్ఆర్‌పేటలో మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భవానీలు

- బావాజీపేట నాలుగోలైనులో శ్రీదేవీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యాన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ట్రస్ట్ సభ్యురాలు బచ్చుమాధవీకృష్ణ ఆధ్వర్యాన అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీ దేవిగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు.
- దుర్గాపురంలో వీరమాచినేని లలిత ఆధ్వర్యాన దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.
- మధురానగర్ నేతాజీకాలనీలోని శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- జీవీఆర్‌నగర్‌లో గద్దే వెంకట్రామయ్యనగర్‌లో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు జరిగాయి.

మహాలక్ష్మి.. నమోస్తుతే

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, ఆంధ్రప్రభకాలనీ, వాంబేకాలనీ ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగో రోజు అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

- స్థానిక 57డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేట నిర్వహిస్తున్న శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీగణపతి యూనివర్సల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో భవానీలు మహాలక్ష్మి అమ్మవారికి విశిష్ట పూజలు చేశారు.
- సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని షిర్డీ సాయి మందిరంలో వేంచేసి ఉన్న కాశీ అన్నపూర్ణ అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

జగన్మాతకు స్వరనీరాజనం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో దసరా మహోత్సవాల సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమం మధురంగా సాగింది. చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు భక్తి గీతాలను మధురంగా ఆలపించారు. మల్లాది స్వాతి, ఉషారెడ్డి, మాధవి, దుర్గానాగమణి, వి. కామేశ్వరి, మద్దెల శ్యాంప్రసాద్, డేవిడ్‌రాజు, వెంకట్, భక్తి గీతాలను ఆలపించారు. చిట్టిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. కళాకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ కృషిని అభినందించారు.

29న ఏపీటీఎఫ్ ధర్నా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం తేవాలని కోరుతూ ఈనెల 29న విజయవాడ ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ అధ్యక్షుడు హృదయరాజు తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌లో ఉన్న అవలక్షణాలన్నీ జీపీఎస్‌లో ఉన్నాయన్నారు. అనంతరం ధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఏపీ టీఎఫ్ అసోసియేట్ అధ్యక్షుడు ఏ సదాశివరావు, ప్రధాన కార్యదర్శి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే ఉన్నత లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష మెగా మెడికల్ క్యాంపును స్థానిక 59వ డివిజన్ సింగ్‌నగర్‌లోని గుజ్జుల సరళాదేవీ కల్యాణ మండపం ఆవరణలో గురువారం నిర్వహిస్తున్నామని ఆ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ మెగా క్యాంపు జరుగుతుందని, నేత్ర, దంత, జనరల్ విభాగాల వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని, సుగర్, బీపీ, థైరాయిడ్, అన్ని రక్తపరీక్షలు చేస్తారని, అలాగే ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.



వీనులవిందుగా సంగీత సభ

విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సభ ఆధ్వర్యంలో దసరా మహోత్సవాల సందర్భంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై నిర్వహిస్తున్న సంగీత ఉత్సవాలు మంగళవారం ముగిశాయి.



వాగ్గేయ కారుల కీర్తనలను ఆలపిస్తున్న వేమూరి విశ్వనాథ్

సంగీత విద్వాంసుడు వేమూరి విశ్వనాథ్ నిర్వహించిన గాత్ర సంగీత సభ ఆకట్టుకుంది. మోహనరాగ వర్ణం ఆదితాళంతో ప్రారంభించి పాలించు శ్యామశాస్త్రి కీర్తన పాలించుకామాక్షి, త్యాగరాస స్వామి కీర్తన సుందరి నీ దివ్యరూపము, అన్నమయ్య కీర్తన తందనానా ఆహి కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై పాలపర్తి నాగేశ్వరరావు, బీవీఎస్ ప్రసాద్, ఘటంపై కిశోర్ సహకరించారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, మృదంగ విద్వాంసురాలు దండమూడి సుమతీ రామ్మోహనరావు, యువ సంగీత కళాకారులు లంకతేజస్వి, సాత్విక, భువన శృతి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

విజయవాడ కల్చరల్: కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో దసరా మహోత్సవాల సందర్భంగా సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణమండపంలో ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భారతీ రాఘవా నృత్యకేంద్రం నిర్వాహకురాలు నాట్యాచారిణి అపర్ణా ప్రసాద్ బృందం కూచిపూడి నృత్య సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. చక్కని తల్లికి ఛాంగ్‌భళా, అదివో అల్లదివో శ్రీహరివాసము, తందనానా కీర్తనలకు నృత్యాలను అభినయించారు. ట్రస్ట్‌బోర్డ్ సభుడు కందుకూరి సుబ్రహ్మణ్యశర్మ ఇతర సభ్యులు నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.



నృత్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

జనగణన బీసీల పాలిట వరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయలేని పనిని నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతంగా చేస్తున్నారని జనగణన బీసీల పాలిట కల్పవృక్షంగా మారనుందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ అంబటి నాగ రాధాకృష్ణ యాదవ్ అన్నారు. స్థానిక ముత్యాలంపాడులో మీడియా సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. బీసీలు అంటే బ్యాక్ బోన్ క్లాస్ అన్న మాటలకే పరిమితం కాకుండా నిజాయితీగా బీసీ కులగణనను చేపట్టడం సీఎం జగన్ చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు.

స్మృతి వనం పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): స్వరాజ్ మైదానంలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం, స్మృతివనం పనులను కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. కారిడార్ చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ, ఏర్పాటు చేసిన గ్రీనరీని సందర్శించారు. ఖాళీగా ఉన్న ప్రదేశంలో పూర్తి స్థాయిలో గ్రీనరీ పెంపొందించాలని ఉద్యానవన విభాగం అధికారులను ఆదేశించారు. లైటింగ్, గ్రానైట్, పాత్ వే, వాటర్ ఫౌంటైన్, వెహికల్ పార్కింగ్, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ, సుందరీకరణ తదితర పనులతో పాటు మ్యూజియం, థియేటర్ సందర్శించి అక్కడ ఎలక్ట్రిసిటీ పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనులలో ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు నిర్వహించాలని సూచించారు. క్వాలిటీ కంట్రోల్, ఏపీఐఐసీ అధికారులు, కేపీసీ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

దుర్గమ్మ దయతో రాష్ట్రం సుభిక్షం : మంత్రి చెల్లుబోయిన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు సంపూర్ణమైన ఆశీస్సులు అందించాలని దుర్గమ్మను కోరుకున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మహాలక్ష్మీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను మంత్రి చెల్లుబోయిన బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హారతుల్లో పాల్గొన్నారు. తొలుత ఆలయ అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి అమ్మవారి సన్నిధికి తీసుకెళ్లారు. దుర్గమ్మ దర్శనం అనంతరం ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను మంత్రికి అందించారు. అలాగే వేద పండితులు ఆశీస్సులు అందించారు. మీడియా పాయింట్‌లో మంత్రి మాట్లాడుతూ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి పరిపాలనకు అమ్మశక్తి అడుగడుగునా తోడుగా ఉండాలని పూజించినట్లు చెప్పారు. దుర్గమ్మ దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. లక్షలాదిగా భక్తులు ఇంద్రకీలాద్రికి వస్తున్నారని.. సామాన్యుడు, సంపన్నుడు అనే తేడా లేకుండా అమ్మవారి దర్శన భాగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే రోశయ్య, గన్నవరం ఎమ్మెల్యే వంశీ అమ్మవారిని దర్శించుకున్నారు.

గడప గడపలో 'నవరత్న' కాంతులు



డివిజన్‌లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- ఒకటో డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాల లబ్ధి ప్రతి గడపకూ అందుతోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. బుధవారం ఒకటో డివిజన్ 1వ వార్డు సచివాలయం పరిధిలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఉద్ధంటి సునీతతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గాంధీజీ కాలనీలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష వంటి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. గంగిరెద్దుల దిబ్బ నుంచి ఈ ప్రాంత ప్రజలకు త్వరలోనే కృష్ణా జలాలను అందిస్తామన్నారు. గత నాలుగేళ్లలో ఈ సచివాలయ పరిధిలో అక్షరాలా రూ. 9. 37 కోట్ల సంక్షేమాన్ని పేదలకు అందజేసినట్లు తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ 165 మందికి సచివాలయ పరిధిలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు.

ఓర్వలేక విషప్రచారం..

గత తెలుగుదేశం ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలు, కుంభకోణాలతో రాష్ట్రాన్ని అన్ని విధాలా భ్రష్టు పట్టించిందని మల్లాది విష్ణు విమర్శించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వ్యవస్థలను రిపేర్లు చేస్తూ.. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపారన్నారు, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో.. ఏపీలో పేదరికం సగానికి సగం తగ్గిందన్నారు. అది చూసి ఓర్వలేక తెలుగుదేశం సోషల్ మీడియా విష ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఈఈ(ఇంజినీరింగ్) శ్రీనివాస్, డీఈ గురునాథం, ఏఈ వెంకటేష్, సీడీఓ జగదీశ్వరి, నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, ఆళ్ల ప్రసాద్ రెడ్డి, ఉద్ధంటి సురేష్, బండి వేణు, ఎల్ఐసీ శివ, యలమంద, ఆర్టీసీ శ్రీను, చంద్రశేఖర్, తుంగం ఝాన్సీ, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



గ్రంథాలయంలో ధ్యానం సాధన చేస్తున్న విద్యార్థులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ధ్యానంతో ఆరోగ్యం, ప్రశాంతతం లభిస్తాయని గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ జమల పూర్ణమ్మ, యోగ అధ్యాపకురాలు నామన సత్య రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో దసరా సెలవుల ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ధ్యానంలో శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ధ్యాన సాధన చేయాలన్నారు. దీని వల్ల మంచి ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు ధ్యానం పట్ల అవగాహన కల్పించారు. వారి చేత కొంత సేపు ధ్యానం చేయించారు. అనంతరం విద్యార్థుల చేత నీతి కథలు చదివించి కథలు చెప్పించారు. భగవద్గీత పఠనం, పాడుతా తీయగా కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె. రమాదేవి, సిబ్బంది వై.ధనలక్ష్మి, జే. శంకర్ పాల్గొన్నారు.